సాక్షి
సిద్దిపేట
బుధవారం । 22 । మే । 2024



గింజకొంటే ఒట్టు..

ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



ఎస్‌ఐ భార్య నిరసన

కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌ఐ భార్య మంగళవారం ఆందోళనకు దిగింది. తన భర్త రెండో పెళ్లి చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయింది. వివరాలు 8లో ▸



బ్రహ్మోత్సవాలకు వేళాయే..

దుబ్బాకలో దుబ్బరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జై హనుమాన్..



హుస్నాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర

హుస్నాబాద్: వీరహనుమాన్ భారీ విగ్రహంతో పట్టణంలో మంగళవారం నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. హనుమాన్ మాలాధారణ భక్తులు హనుమాన్ విగ్రహంతో పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. జైశ్రీరాం..జై హనుమాన్ నామస్మరణలతో పట్టణం మారుమోగింది. భక్తిపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు మంగళహారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

గజ్వేల్ ఏడీఏ బాబునాయక్



మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, రాయపోల్ మండలాల్లోని విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ఉత్పత్తులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ధరల పట్టిక కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. గజ్వేల్, కొండపాక వ్యవసాయాధికారులు నాగరాజు, ప్రియదర్శిని ఆయా మండలాల ఏఈఓలు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

గజ్వేల్‌రూరల్: పాలిటెక్నిక్ విద్యనభ్యసించేందుకు నిర్వహించే పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జీఎంఆర్ (ప్రభుత్వ ఆదర్శ గురుకుల) పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24న పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 819 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు.

రచయితలకు ప్రభుత్వం అండగా ఉండాలి

జాసాప రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతచంద్రయ్య



మాట్లాడుతున్న ఐతచంద్రయ్య తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోని కవులు, రచయితలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ, సాహిత్యాన్ని ఆదరించాలని జాతీయ సాహిత్య పరిషత్ (జాసాప) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐత చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐతచంద్రయ్య మాట్లాడుతూ కవులు, రచయితలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రంథాలయాల ద్వారా కవులు, రచయితలు రాసిన పుస్తకాలు కొనుగోలు చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రచయితలను ప్రభుత్వం ఆదుకోవాలని, తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తెస్తున్న రచనలు ఎంతో వ్యయప్రయాసలకు ఓడ్చి ప్రచురించిన పుస్తకాలు లక్షలాది మందికి చేరాలన్నారు. కార్యక్రమంలో జసాప అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, యువకవి బస్వ రాజ్ కుమార్, చీకోటిరాములు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో ఖాళీగా ఉన్న కొన్ని మైనార్టీ సీట్లతోపాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం నేరుగా పాఠశాల, కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆశలు ఆవిరే!

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. సన్న వడ్లకే బోనస్ అంటూ ప్రకటించడమే ఇందుకు కారణం. జిల్లాలో అధిక శాతం దొడ్డు వడ్లనే పండిస్తారు. సన్న వడ్లకు బోనస్‌ను వచ్చే వర్షాకాలం నుంచి చెల్లిస్తామని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించారు. దీంతో ఎక్కువ మంది రైతులు బోనస్ అందక అన్యాయం జరగనుంది. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది.

– సాక్షి, సిద్దిపేట

సన్న వడ్లకే బోనస్

- ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో నిరుత్సాహం
- జిల్లాలో అధిక భాగం దొడ్డు వడ్ల సాగే..
- కేవలం 20 శాతమే సన్నాలు...
- బహిరంగ మార్కెట్‌లో వీటికి డిమాండ్
- అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని సర్వత్రా డిమాండ్



వర్గల్(గజ్వేల్): మైలారం కొనుగోలు కేంద్రంలో బోనస్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా గత వానాకాలంలో 5,20,690 ఎకరాలు సాగైతే అందులో 3,79,108 ఎకరాల్లో వరిని సాగు చేశారు. గత యాసంగిలో 3,82,335 ఎకరాలు సాగైతే 3,48,009 ఎకరాల్లో వరిని పండించారు. 80శాతం మంది దొడ్డు రకం, 20శాతం మంది సన్నాలు సాగు చేశారు. సన్న వడ్ల పంట కాలం ఎక్కువ. నీటిని ఎక్కువగా అందించాలి. దిగుబడి తక్కువ. అంతేకాక..చీడ పురుగులు, తెగుళ్ల బారిన పడే అవకాశాలు ఎక్కువ. దీంతో సన్నాల సాగుకు మొగ్గు చూపడంలేదు. ఎక్కువ శాతం పండించే వడ్లను కాదని తక్కువ శాతం పండించే సన్న వడ్లకే బోనస్ ఇస్తామని నిర్ణయం తీసుకోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సన్నాలకు డిమాండ్

సన్న వడ్లకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు వడ్లకు రూ.2,800 నుంచి రూ 2,900 వరకు చెల్లిస్తుంటారు. అదే కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ వడ్లకు మద్దతు ధర రూ.2,203, కామన్ గ్రేడ్ వడ్లు రూ.2,183 చెల్లిస్తున్నారు. తేమ 10 శాతం మాత్రమే ఉండాలని నిబంధన పెట్టడంతో ఆ వడ్లను కొనుగోలు కేంద్రాల వద్ద ఆర బెడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద కాపలా ఉంటున్నారు. తాలు పేరుతో కోతలు విధిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్న వడ్లకు ఎలాంటి కోతలు, తేమ చూడకుండానే నేరుగా కాంటాలు పెడుతున్నారు. బయట సన్న వడ్లకు డిమాండ్ ఎక్కువ. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తక్కువగా తీసుకెళ్తారు. దీంతో బయటనే సన్న వడ్లను ఎక్కువ మంది రైతులు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు రాని వడ్లకు బోనస్ ఎలా ఇస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌వి బోగస్ హామీలు

వర్గల్(గజ్వేల్): అబద్ధపు హామీలు, అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, సన్న, దొడ్డు వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం వర్గల్ మండలం మైలారం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలను ఆయన బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చ డం తగదన్నారు. రైతుల సమస్యలపై అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకూ ఇవ్వాల్సిందే..



ఓట్ల ముందు ఓ మాట. ఆ తర్వాత ఒక మాట అయితే ఎట్లా? ఎకరాకు సన్నాలు 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. దొడ్డు వడ్లు 29 క్వింటాళ్లు పండుతాయి. 15 క్వింటాళ్లకు రూ.7,500 బోనస్ ఆశ పడితే దొడ్డు వడ్లు ఎకరాకు 14 క్వింటాళ్ళ దిగుబడికి రూ.30వేలు నష్ట పోతాం. బోనస్ అన్ని రకాల వడ్లకు ఇస్తేనే గిట్టుబాటు అవుతుంది.

– సటికం శ్రీధర్, హుస్నాబాద్

నిర్ణయం సరైంది కాదు



ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటూ చెబుతుండటం సరైంది కాదు. నూటికి 99 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. మా భూముల్లో సన్నం వడ్లు పండవు. యాసంగిలో సన్నం వడ్ల సాగుకు ఎవరూ మొగ్గు చూపరు. ఎన్నికల సర్కార్ చెప్పిన విధంగా అన్ని రకాల వడ్లుకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే. లేదంటే అన్యాయం చేసిన వాళ్లవుతారు.

– కురుమ పాపయ్య, దుబ్బాక

చాలా బాధాకరం



నేను 4 ఎకరాలతో పాటు కౌలుకు 2 ఎకరాలు తీసుకుని వరి సాగు చేస్తున్నా. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు కౌలు కోసం ఉపయోగపడుతాయని ఆశించా. ఇప్పుడు సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడం చాలా బాధాకరం. ఇప్పటికైన ప్రభుత్వం నిర్ణయం మార్చుకుని అన్ని రకాల వడ్లకు ఇవ్వాలి.

– అడుకని రవీందర్, రాంసాగరం, బెజ్జంకి



ఇర్కోడ్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న భారతీహోళికేరి, చిత్రంలో కలెక్టర్

పది రోజుల్లో పూర్తి చేయండి

- ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి
- అధికారులకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: పది రోజుల్లో వరిధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి అధికారులకు సూచించారు. మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై, కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలకు ఇంకా రావాల్సిన వరి ధాన్యంపై పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. కేంద్రాలలో టార్పాలిన్, ప్యాడి క్లీనర్లు సరిపడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు అందరూ తమ కెపాసిటీ ప్రకారం మిల్లింగ్ చేసి, ఎఫ్‌సీఐకి పంపేలా చూడాలన్నారు. రైస్ మిల్లుల్లో స్థల సమస్య ఉన్నట్లయితే అందుబాటులో ఉన్న ఏఎంసీ గోడౌన్లను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

2లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కొనుగోళ్లు

ఇప్పటివరకు 50,953 రైతుల నుంచి 2,23,198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.491కోట్లకు గాను ఇప్పటివరకు రూ.409 కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. అనంతరం సిద్దిపేట రూరల్ మండలంలో ఇర్కోడు ఐకేపీ కేంద్రం సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్, డీఆర్డీఓ జయదేవ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, జిల్లా రవాణా అధికారి వేణు, లీగల్ మెట్రాలజీ అధికారి, రైస్ మిల్లర్లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

తూకంలో అవకతవకలకు పాల్పడవద్దు

దుబ్బాక: ధాన్యం తూకంలో అవకతవకలకు పాల్పడవద్దని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూకంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయన్నారు. అకాల వర్షాలతో కొంత ఇబ్బందులు తలెత్తాయని అయినా రైతులు, అధికారుల సహకారంతో త్వరితగతిన చేశామన్నారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 2, 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులు వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాలో జమ అయిన డబ్బులు తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ తదితరులు ఉన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు

రాజీవ్ సేవలు మరువలేనివి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కొనియాడారు. మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్‌లోని తన నివాసంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పరితపించి వారి సంక్షేమం ఎన్నో చర్యలు చేపట్టిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. రాజీవ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని సర్కార్

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి
- హుస్నాబాద్‌లో రణభేరి దీక్ష



దీక్షలో మాట్లాడుతున్న రాంగోపాల్ రెడ్డి

హుస్నాబాద్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం రైతన్నల కోసం బీజేపీ నాయకులు రణభేరి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. హామీలు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమిస్తామన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా త్వరగా కొనుగోలు చేయాలన్నారు. బీజేపీ నేతృత్వంలో నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే రణభేరి దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

- విధులు అప్రమత్తంగా నిర్వహించాలి
- డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్
- మహిళా ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం

సిద్దిపేటకమాన్: గ్రామ స్థాయిలో ప్రజలకు సమయానుకూలంగా వైద్య సేవలందించాలని, నిర్లక్ష్యం తగదని డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలతో డీఎంహెచ్‌ఓ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిగా నమోదైనప్పటి నుంచి నెల వారీగా ఆరోగ్య పరీక్షలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వంటి సేవలు నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు గుర్తిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయా స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తూ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వినోద్‌బాబ్జి, డాక్టర్ విజయ రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 91 మంది హాజరు

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు రెండో రోజు 91 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30 వరకు నిర్వహించిన తొలి సెషన్‌కు 43 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు నిర్వహించిన సెషన్‌కు 48మంది పాల్గొన్నారు. 9 మంది గైర్హాజర్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో రఘు, షాదుల్లా, డీపీ రావు పర్యవేక్షించారు.

ఇంద్రేశంలో కేంద్ర బృందం పర్యటన

పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం గ్రామంలో కేంద్ర ట్రైనీ అసిస్టెంట్ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. శిక్షణలో భాగంగా గ్రామ జనాభా, మౌలిక వసతులు, రైతుల స్థితిగతులు, ప్రజల ఆదాయ వనరులు తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వారు ఇక్కడ పర్యటించారు. ప్రజల జీవనాధారం, గ్రామ అభివృద్ధి రేటు, వివిధ శాఖల సేవలు, సంక్షేమ పథకాలు ఎలా అమలవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాల పరిశీలన తోపాటు పంచాయతీలో మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. పల్లెప్రకృతి వనం, కమ్యూనిటీ భవనాలను పరిశీలించనున్నారు.

సకాలంలో యూనిఫామ్స్ అందించాలి

- పాఠశాలల్లో అత్యవసర పనులు పూర్తి చేయాలి
- సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ అదనపు డైరెక్టర్ రమేశ్



అధికారులతో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ అదనపు డైరెక్టర్ రమేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాలల పునః ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫామ్స్ (ఏకరూప దుస్తులు) పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ అదనపు డైరెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. జిల్లాకు కేటాయించిన వస్త్రాలు మండలాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఇందిరానగర్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమేశ్ హాజరయ్యారు. పాఠశాలలు ప్రారంభం నాటికి అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రంగథాంపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండపాక సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

సిద్దిపేటఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు రూ.12 వేలు, మహిళలకు రూ. 2,500 ఆర్థిక సాయం, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు, ఉపాధి కూలీల బకాయిల విడుదలకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సొంత స్థలం ఉన్న వారికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, శశిధర్, ఉపాధ్యక్షుడు రవీందర్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రవీందర్, బాలకిషన్, శ్రీనివాస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో ఇల్లు, గడ్డివాము దగ్ధం

మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలు



కాలిబూడిదైన రేకుల ఇల్లు

నారాయణఖేడ్: అగ్ని ప్రమాదంలో గడ్డి వాముతోపాటు ఓ రేకుల ఇల్లు దగ్ధమైంది. మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలం పలు గుతండాలో జరిగింది. బాధితుడు, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ శంకర్‌నాయక్‌కు రేకులతో కూడిన ఇల్లు ఉంది. పక్కనే గడ్డివాము వేశాడు. సోమవారం సాయంత్రం గడ్డివాముకు మంటలు వ్యాపించి అది కాస్తా రేకుల ఇంటికి అంటుకున్నాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న బియ్యం, జొన్నలు, పప్పుదినుసులు, దుస్తులు దగ్ధమయ్యాయి. మొత్తం రూ. లక్ష వరకు నష్టం సంభవించింది. ఇంటి యజమాని శంకర్‌నాయక్ మంటలు అర్పేందుకు యత్నించి గాయాల పాలయ్యాడు. తండా వాసులు ఖేడ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేలోపే గడ్డివాము, ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. శంకర్‌నాయక్‌ను చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు.

అస్థిపంజరం లభ్యం



గుర్తుతెలియని అస్థిపంజరం


పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని అస్థిపంజరం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామ శివారు.. గోపాలకృష్ణ వ్యవసాయ పొలం సమీపంలో మునగ చెట్టు కింద పూర్తిగా కుళ్లిన స్థితిలో అస్థిపంజరం సోమవారం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, చనిపోయి 15 రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి



మృత్యువాత పడిన ఎద్దు

హత్నూర(సంగారెడ్డి): విద్యుత్ షాక్ తో రెండు ఎడ్లు మృతిచెందాయి. ఈ సంఘటన హత్నూరలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. హత్నూర గ్రామ శివారులో నివాసముంటున్న గంగిరెద్దుల వాళ్లకు రెండు ఎడ్లు ఉన్నాయి. ఇవి రోజులాగే సోమవారం కూడా బ్రాహ్మణగూడ గ్రామాల మధ్యలో ఉన్న కొండని గారి కుంట సమీపంలోకి వెళ్లి మేత మేస్తున్నాయి. ఇక్కడే లూజైన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. ఎంతకీ ఇంటికి రాకపోయేసరికి మంగళవారం వెతకగా ఉదయం మృత్యువాత పడి ఉన్నాయని స్థానికులు తెలిపారు.



ధాన్యం రాశులు

షేర్‌ఖాన్‌పల్లికి రైతు సంజీవ. తనకున్న 3 ఎకరాల్లో వరి సాగు చేశాడు. సుమారుగా 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ.35 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అతను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లు తీసుకువచ్చి ఆరబెట్టాడు. ఇప్పటి వరకు నిర్వాహకులు ఒక్క బస్తా కూడా తూకం వేయలేదు. వర్షాల కారణంగా ఎండిన ధాన్యం తడిసి ముద్దయింది. ప్రస్తుతం మొలకలు వచ్చాయి. ఇది ఇతని ఒక్కడి పరిస్థితే కాదు గ్రామంలోని రైతులు అందరిదీ కూడా ఇదే విధంగా ఉంది.

గింజకొంటే ఒట్టు..

అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి మొలకలు

- 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- నేటికీ షేర్‌ఖాన్‌పల్లిలో జరగని విక్రయాలు
- కూలీల కొరతే కారణమంటున్న అధికారి
- ఆందోళనలో రైతన్న

జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు తూకం వేసి కొంటున్నారు. కొంతలో కొంత రవాణా ద్వారా గోదాంలకు తరలిస్తున్నారు. కానీ హత్నూర మండలంలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. షేర్‌ఖాన్‌పల్లిలో వరి రైతుల నుంచి గింజ కూడా కొనలేదు. అందుకు కారణం కూలీల కొరత అని చెబుతున్నారు అధికారి. రైతులేమో కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి 15 రోజులైందని వాపోతున్నారు. గింజ కూడా కొనకపోవడంతో ఎప్పుడు కొంటారోనని దీనంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.

హత్నూర(సంగారెడ్డి):

అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. అప్పులు తెచ్చి మరీ సాగు చేశామని కన్నీరు మున్నీరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట కొనుగోలు చేస్తున్న అధికారులు షేర్‌ఖాన్‌పల్లిలో ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభించకుంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లిలో హత్నూర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో ఈనెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఇప్పటికే (40 రోజుల క్రితమే) రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చి ఆరబెట్టారు. కేంద్రం ప్రారంభమై 15 రోజులు గడిచిపోయినా ఒక్క ధాన్యం బస్తా కూడా తూకం వేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా హత్నూర మండలంలోని ధాన్యం కేంద్రాల వద్ద కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. గన్ని బ్యాగుల కొరత ఒక వైపు, లారీలు సక్రమంగా రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యం విక్రయించేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఇంకో వైపు ఏర్పడింది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసేలా చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

కారణం అదే : శ్రీనివాస్, సీఈఓ

హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కూలీల కొరత వల్ల ఇంకా ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. గ్రామంలో వరి కోతలు లేటుగా ప్రారంభమయ్యాయి. ఈనెల 5న కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. కానీ కూలీల కొరత వల్లే ఇంకా కొనుగోలు చేయలేకపోయాం. ఒకటి.. రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. గ్రామంలో రెండు మూడు లారీల లోడు మాత్రమే ధాన్యం నిల్వలు ఉన్నాయి.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

వడ్ల బస్తాలతో నిండిన సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ కొనుగోలు కేంద్రం





ధాన్యం బస్తాలను పేరుస్తున్న వ్యక్తి

చలించండి మహాప్రభో..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల బస్తాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వచ్చిన వడ్లు వచ్చినట్లు బస్తాలుగా పేరుస్తున్నారు. ఇందుకు కారణం.. అవసరానికి తగినట్లుగా లారీలు అందుబాటులో లేకపోవడమే. దీంతో మిల్లులకు తరలించాలంటే రెండు లేక మూడు రోజుల వరకు ఎదురు చూడాల్సిందే. అక్కడ కూడా త్వరితగతిన ధాన్యం దించుకోవటం లేదని తెలుస్తోంది. పైగా మూడురోజులు వర్షం సూచన ఉన్నప్పటికీ అధికారులు ధాన్యం తరలింపుపై సరైన దృష్టి కేంద్రీకరించడం లేదని రైతులు వాపోతున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి.



అమ్మకానికి తెచ్చిన ధాన్యం

ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయింపు

- కనీస సౌకర్యాలపై నిలదీసిన ప్రయాణికులు
- గోవాకు వెళ్లలేకపోయిన 25 మంది



బస్సు వద్ద ప్రయాణికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బస్సులో కల్పించాల్సిన కనీస సదుపాయాలపై అడిగితే ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయించాడు. దీంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోలేకపోయారు. ఈ ఉదంతం రామచంద్రపురంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి గోవాకు సోమవారం రాత్రి బయలుదేరే ఓంశ్రీ ట్రావెల్స్ బస్సుకు 25 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ఎల్‌బీనగర్‌లో బస్సు నిర్వాహకులు ప్రయాణికులను పిక్ అప్ చేసుకోవాల్సి ఉండగా మియాపూర్ వరకు రావాలని కోరారు. వారు ఇక్కడికే వచ్చి బస్సు ఎక్కారు. కానీ కనీస సౌకర్యాలు లేకపోవడం, లోపల అపరిశుభ్రంగా ఉండటం, వైర్లు బయటకి కనబడుతుండగా కొంతమంది ప్రయాణికులు డ్రైవరు దృష్టికి తీసుకెళ్లారు. అతను వారితో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూనే దురుసుగా ప్రవర్తించాడు. బస్సు రామచంద్రాపురం.. అశోక్‌నగర్ వద్దకు చేరుకోగానే డ్రైవరు వాహనాన్ని పక్కకు ఆపి దిగి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. ప్రయాణికులు.. బస్సు నిర్వాహకుడు సునీల్ ఫోన్ చేయగా అతను కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వేరొక డ్రైవర్ వస్తాడన్నాడు. కానీ మంగళవారం ఉదయం వరకు చూసినా ఎవరూ రాలేదు. దీంతో బస్సు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వైజాగ్‌కు చెందిన చరణ్ వర్మ బుధవారం గోవాలో జరిగే ఇండియాన్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉండగా బస్సు ఇక్కడే ఆగిపోయింది. అయితే తోటి ప్రయాణికులు అందరూ కలిసి మంగళవారం రాత్రి గోవాకు వెళ్లేందు విమాన టికెట్‌ను బుక్ చేశారు. కాగా చరణ్ వర్మ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగో అంతస్తుపై నుంచి పడి ..

- కూలీ దుర్మరణం
- అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: నాలుగో అంతస్తుకు లిఫ్ట్ ద్వారా ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ కింద పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అరుణ్ లేట్(22) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌కు వచ్చాడు. ఇక్కడి బిల్డర్ తేజరామ్.. పీజేఆర్ ఎంక్లేవ్ రోడ్ నంబర్ 7లో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పని చేసే చోట నాలుగో అంతస్తుకు ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికుడు రంజన్ ఇతరులు కలిసి వెంటనే క్షతగాత్రుడిని చందనగర్ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అరుణ్ మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిల్డర్ ముందస్తు భద్రతా చర్యలు తీసుకోనందునే పై నుంచి కింద పడి చనిపోయాడని మృతుడి గ్రామస్తుడైన రంజన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): అక్రమ ఇసుక డంపుపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీస్‌లు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. మంగళవారం మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలపల్లి గ్రామ శివారులో 150 టన్నుల డంపును నిల్వ చేశారని సమాచారం మేరకు ఈ దాడులు చేశారు. ఆపై డంపును సీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ ఇసుక డంపును నిల్వ చేశారని అధికారులు తెలిపారు. అన్ని విధాలుగా విచారణ చేసి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రజలు టాస్క్‌ఫోర్స్, పోలీసుల (87126-67445, 87126-67447, 87126-67446)కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఇసుక డంపును స్వాధీనం తీసుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీస్ అధికారులు

వ్యక్తికి రిమాండ్

సిద్దిపేటకమాన్: ఇసుక అక్రమ రవాణా చేస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సంపంగి నవీన్ కొంతకాలంగా కరీంనగర్ జిల్లా రేణిగుంట వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈ నెల 9న పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తూ అతను పట్టుబడ్డాడు. అయితే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ను నెట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా నిందితుడు మంగళవారం ఇసుక లారీతో సహా సిద్దిపేట టూటౌన్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ తెలిపారు. అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎఫ్ఆర్ఎస్‌ది రెండో స్థానం

- పండ్ల పెంపకంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది
- కొండా లక్ష్మణ్ బాపూజీ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నీరజ



మామిడి పండ్ల ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ చాన్స్‌లర్ నీరజ

సంగారెడ్డి: అన్ని పండ్లలో రారాజు మామిడని, పండ్ల మొక్కల పెంపకంలో సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్ (ఫ్రూట్ రిసెర్చ్ సెంటర్) రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ఫల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు. ప్రతి రైతూ మంచి మొక్కలను ఎంచుకొని నాటుకోవాలని సూచించారు. 242 రకాల పండ్లను ప్రదర్శనలో ఉంచామన్నారు. అధిక దిగుబడిలో దాసరి ముఖ్యమైనదని, మల్లిక లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నారు. మంజీరా రకం పండ్ల తోటల పెంపకంలో మొదటి స్థానంలో ఉందన్నారు. పండ్ల తోటల మొక్కల పెంపకంలో కొత్త రకం ఎంపిక చేసే ముందు రిసెర్చ్ చేయాల్సి ఉందన్నారు. ఆ తర్వాత సత్ఫలితాల ఆధారంగా ఆమోద ముద్ర వేస్తామన్నారు. మొక్కల్లో తల్లి వేరు వ్యవస్థ బాగా లేకపోవడంతో చెట్లు పాడైపోతుంటాయన్నారు. వేరేగా మొక్కలను నాటుకోవాలని సూచించారు. కాగా, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రదర్శనలో కొండాపూర్ మండలం తేర్పోల్‌కు చెందిన రైతు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తాను గతంలో ఒక నర్సరీలో మొక్కలు తెస్తే నిర్వాహకులు మోసం చేశారన్నారు. అదే ఎఫ్ఆర్ఎస్‌లో తెచ్చిన మొక్కల్లో అన్నీ బాగున్నాయన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకందారులకు రాయితీ కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ ప్రదర్శన బుధవారం సైతం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్, హార్టీకల్చర్ ఏడీఏ శ్రీధర్ , శాస్త్రవేత్తలు హరికాంత్, డాక్టర్ మాధవి, నిత్తీష , హార్టికల్చర్ అధికారులు కీర్తి కృష్ణ, సమత పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

ఒకరికి తీవ్రగాయాలు

పోచారం సమీపంలో ఘటన

పటాన్‌చెరు టౌన్: బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పోచారం సర్వీస్ రహదారి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొండాపూర్ మండలం ఉత్తరపల్లికి చెందిన మహేందర్‌ను టిప్పర్ సోమవారం రాత్రి ఢీకొంది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వారు ఇక్కడికి చేరుకున్నారు. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోకలిబండతో భార్య దాడి

భర్తకు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం

మనోహరాబాద్‌లో ఉదంతం

మనోహరాబాద్(తూప్రాన్): భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా భర్తపై భార్య రోకలి బండతో దాడి చేసింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌లో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్కిబండ పంచాయతీ.. తుపాకులపల్లి గ్రామానికి చెందిన నిమ్మల శివయాదవ్, తన భార్య ఇద్దరూ సోమవారం రాత్రి గొడవ పడ్డారు. కోపొద్రిక్తురాలైన భార్య రోకలిబండను తీసుకొని భర్త తలపై మోదింది. దీంతో అతడి తల పగిలి రక్తం కారుతుంది. గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ గొడవపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

పీఎస్ ఎదుట ఎస్ఐ భార్య నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఐ నాగరాజు మొదటి భార్య మానస, బంధువులు

న్యాయం చేయాలని వేడుకోలు

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం ఆందోళనకు దిగింది. తన భర్త రెండో పెళ్లి చేసుకొని, ఇద్దరు కుమారులను తీసుకెళ్లాడని, న్యాయం చేయాలని కోరింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఎస్ఐ నాగరాజు తనను పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారని మానస తెలిపింది. రెండేళ్ల నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడని, అనంతరం రెండో పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. తన ఇద్దరు పిల్లను దూరం చేసి మరో సంసారం చేస్తూ తనకు అన్యాయం చేస్తున్నాడని వాపోయింది. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లో పెట్టి తన ఇద్దరు పిల్లలను తీసుకెళ్లి విడాకులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. దీంతో తాను ఆత్మహత్యకు యత్నించగా.. పిల్లలను తనకు ఇప్పించి న్యాయం చేస్తామని బంధువులు చెప్పడంతో విరమించినట్లు తెలిపింది. ఈ విషయమై సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తకు ఫోన్ చేస్తే నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాడని పేర్కొంది. బంధువులతో కలిసి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు రాగా ఎస్ఐ ఆరు రోజులుగా సెలవులో ఉన్నాడని చెప్పారని తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని చెప్పింది. సీఐ శ్రీనివాస్ వివరణ కోరగా.. ఇటీవల మానస ఈ విషయం తన దృష్టికి తీసుకువచ్చిందని, కౌన్సెలింగ్ ఇచ్చామని, ఉన్నత అధికారుల ఆదేశానుసారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సత్యం(ఫైల్)

దుబ్బాకరూరల్: ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రామక్కపేటలో జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రంగు సత్యం(45)కు, కుటుంబ సభ్యులకు మధ్య ఆస్తి పంపకాల విషయమై మంగళవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో మనస్తాపానికి గురై అతను మధ్యాహ్నం 2 గంటలకు ఇంటిలో ఉన్న తన పిల్లలను బయటకు పంపించి తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు చీర బిగించి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని తన పిల్లలు ఇంటి బయట బీడీలు చుడుతున్న తల్లి లావణ్యకు చెప్పారు. ఆమె ఇరుగు పొరుగు వారిని పిలిచి తలుపులు తెరిచారు. ఫ్యాన్‌కు వేలాడుతున్న సత్యంను కిందకు దింపి దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.